

సమస్యలన్నీ పరిష్కరిస్తామన్నారు..

రోడ్డెక్కించారు





సీపీఎస్ రద్దు, ఇతర సమస్యలను పరిష్కరించాలని కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక పెన్షనర్ల ఐక్యవేదిక సంఘ నాయకులు (ఫైల్)



ఉద్యోగులకు ఇదే మేలు..

ఓపీఎస్: పాత పింఛన్ స్కీం (ఓపీఎస్)లో ప్రభుత్వ ఉద్యోగులు పదవీ విరమణ నాటికి బేసిక్ పే, డీఏలో లెక్కలో తీసుకొని పింఛన్ ఇస్తారు. చివరిగా రూ. 50 వేలు వేతనం ఉంటే పింఛన్‌గా రూ. 25 వేలు ప్రతి నెలా దక్కుతుంది.

● **ఏం లాభం లేదు..**

సీపీఎస్ : కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్) అంటే ఉద్యోగులు బేసిక్ పే, డీఏతో సంబంధం ఉండదు. ఉద్యోగులు పొదుపు చేసిన ధనాన్ని పెట్టుబడిగా ఉంచి ప్రతి నెల పింఛన్ ఇచ్చే స్కీం. ఉద్యోగ విరమణ నాటికి రూ. 10 లక్షలు ఖాతాలో ఉంటే 60 శాతాన్ని ఉద్యోగ విరమణ బెనిఫిట్స్‌గా విత్‌డ్రా చేసుకోవచ్చు. మిగిలిన 40 శాతం పెట్టుబడిగా ఉండాల్సిందే. ఈ 40 శాతం పెట్టుబడిగా ఉన్న నగదు నుంచి పింఛన్‌గా ఇచ్చే మొత్తం సామాజిక పింఛన్ కన్నా తక్కువే. ఒకవేళ దురదృష్టవశాత్తు సీపీఎస్ ఉద్యోగి మరణిస్తే రూ.10 వేలు మట్టి ఖర్చులకు ఇస్తారు. షేర్‌లో పొదుపు చేసిన నగదు పూర్తిగా విత్‌డ్రా చేసుకుంటే పింఛన్ వర్తించదు.

● **బెనిఫిట్స్ ఉండవు..**

జీపీఎస్ : గ్యారెంటీడ్ పెన్షన్ స్కీం (జీపీఎస్) పేరిట ఉద్యోగులకు వైసీపీ ప్రభుత్వం వేసిన వల ఇది. ఉద్యోగ విరమణ తరువాత బెనిఫిట్స్ ఏమీ ఉండవు. పింఛన్ కావాలంటే నగదు 100 శాతం మొత్తం పొదుపులో ఉండాల్సిందే.

- ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులపై వైసీపీ నిర్లక్ష్య ధోరణి
- మాట మార్చి.. మడమ తిప్పిన ముఖ్యమంత్రి జగన్
- గాలిలో కలిసిపోయిన సీపీఎస్ రద్దు హామీ
- ఓపీఎస్ అమలు ఎక్కడ?
- దాని స్థానంలో కొత్తగా జీపీఎస్ రాగం
- ప్రతినెలా ఒకటిన జీతాలు, పెన్షన్లు అందించని వైనం
- పీఆర్సీ అమలులో మోసం.. ఇతర బకాయిలు చెల్లించని సర్కారు
- దీనిపై ఆందోళనలు చేపట్టినా స్పందించని ప్రభుత్వం
- వివిధ సంఘాల నాయకుల మండిపాటు

(పార్వతీపురం- ఆంధ్రజ్యోతి/కొమరాడ)

'అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లోనే సీపీఎస్ రద్దు చేస్తాం.. ఫ్రెండ్లీ ప్రభుత్వంలో ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలన్నీ పరిష్కరిస్తాం.. ఉద్యోగుల సంక్షేమానికి కట్టుబడి ఉంటాం.' అని గత ఎన్నికల సమయంలో సీఎం జగన్ హామీలిచ్చారు. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత మాట మార్చి.. మడమ తిప్పారు. సీపీఎస్ స్థానంలో జీపీఎస్ తీసుకొచ్చారు. ప్రతినెలా పెన్షన్లు, జీతాలకు పెన్షనర్లు, ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎదురుచూసేలా చేశారు. పీఆర్సీ, డీఏ తదితర బకాయిలతో పాటు సకాలంలో పీఎఫ్ సొమ్ములను కూడా చెల్లించలేక పోయారు. ఎన్నడూ లేని విధంగా వాటి కోసం వారంతా రోడ్డెక్కేలా చేశారు. ఆందోళన కార్యక్రమాలు చేపట్టిన వారికి నోటీసులు ఇచ్చారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నేతలను గృహ నిర్బంధాలు, అక్రమ కేసులు, బైండోవర్‌తో కట్టడి చేశారు. మొత్తంగా వైసీపీ సర్కారు ఐదేళ్ల కాలంలో ఉద్యోగ, ఉపాధ్యాయులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసింది.

ఇదీ పరిస్థితి..

జిల్లాలో మొత్తంగా ఉద్యోగ, ఉపాధ్యాయులు 17,307 వరకూ ఉన్నారు. వారు కాకుండా సచివాలయ పరిధిలో ఉద్యోగులు తదితరులు ఉన్నారు. అయితే వారంతా గత ఎన్నికల్లో జగన్ మాటలు నమ్మి.. వైసీపీకి ఓటు వేశారు. అయితే అధికారంలోకి వచ్చిన నాటి నుంచే వైసీపీ వారిని అనేక అవమానాలకు గురిచేసింది. ఎన్నికల్లో గెలిచాక సీపీఎస్ రద్దుపై మాట్లాడాలంటే ఉద్యోగులకు అపాయింట్‌మెంట్ లేదు. ప్రభుత్వం కొలువుదీరిన తొలి రెండేళ్లు మౌనంగా ఉన్న ఉద్యోగులు తరువాత ఉద్యమ బాట పట్టారు. దీన్ని అడ్డుకునేందుకు అడుగడుగునా సర్కారు ప్రయత్నించినా ఉద్యోగ, ఉపాధ్యాయులు తమ పోరాటాన్ని కొనసాగించారు. చివరకు ప్రభుత్వం చర్చలకు పిలిచి జీపీఎస్ (గ్యారెంటీ పెన్షన్ స్కీమ్) అంటూ కొత్త రాగం అందుకుంది. ఇది కూడా తమను మోసం చేసేదేనంటూ ఉద్యోగులు మళ్లీ ఆందోళన కార్యక్రమాలు కొనసాగించారు. హక్కుల కోసం పోరాడుతున్న వారిపై పరోక్ష రూపంలో వైసీపీ క్షోభ పెట్టింది.

● గత ప్రభుత్వాల హయాంలో ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రతినెలా ఒకటో తేదీకే జీతం వచ్చేది. దీంతో వారు అన్ని అవసరాలు సర్దుబాటు చేసుకునేవారు. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సీన్ మారింది. ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రతినెలా జీతం ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి. చివరకు రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులు కూడా పెన్షన్ కోసం ఎదురు చూడాల్సిన దుస్థితి ఏర్పడింది. కొన్నిసార్లు 12వ తేదీ వరకు జీతాలు, పెన్షన్లు చెల్లించకుండా ఆయా వర్గాలు తీవ్ర ఆందోళనకు గురయ్యేలా వైసీపీ చేసింది. దీంతో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులు 'ప్రతినెలా ఒకటో తేదీకే జీతాలు ఇప్పించండి మహా ప్రభో' అంటూ నిరసన కార్యక్రమాలు చేపట్టాల్సి వచ్చింది. సక్రమంగా జీతాలు చెల్లించకపోవడంతో బ్యాంకు ఈఎంఐలు తదితర వాటిని సకాలంలో కట్టలేక తమ పరపతి పోతోందని, ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఎంతోమంది ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేసినా.. సర్కారు స్పందించలేదు. మరోవైపు పెన్షనర్లు కూడా వైద్య ఖర్చులు, మందుల కొనుగోలుకు అవస్థలు పడినా.. వారిపైనా వైసీపీ కరుణ చూపలేదు.

● గత కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాల హయాంలో ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై వినతిపత్రం అందించిన వెంటనే వాటిని పరిష్కరించేందుకు ప్రయత్నించే పరిస్థితి ఉండేది. వారు ఎటువంటి ఆందోళనకు గురికాకుండా చూసుకునేవారు. కానీ వైసీపీ ప్రభుత్వ కాలంలో ఆ పరిస్థితి లేకుండా పోయింది. తమ సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వానికి వినతిపత్రాలు అందించినా స్పందించకపోడంతో వివిధ రూపాల్లో ప్రభుత్వ ఉద్యోగ ఉపాధ్యాయుల నిరసన కార్యక్రమాలు చేపట్టారు. సంఘాల ఆధ్వర్యంలో వైసీపీ ప్రభుత్వ వైఖరికి నిరసనగా భిక్షాటన, రోడ్లు శుభ్రం చేయడం, నల్ల రిబ్బన్లు ధరించి విధులు నిర్వహించడం.. ఇలా ఎన్నో ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు.



ఐఆర్, ఆర్థిక బకాయిలు చెల్లించాలని యజ్ఞం చేస్తూ నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు, యూటీఎఫ్ నాయకులు (ఫైల్)

● ఉద్యోగులకు జీపీఎఫ్, డీఏ, పీఆర్సీ, ఏపీజీఎల్ఐ బకాయిలు, ఇతర అలవెన్సులు వైసీపీ చెల్లించలేదు. ఐదేళ్లుగా ఆర్జిత సెలవులను నగదుగా మార్చుకోలేని పరిస్థితి. ఉద్యోగ విరమణ తర్వాత సకాలంలో పింఛన్ మంజూరు చేయలేదు. మరోవైపు ఆన్‌లైన్ సేవలు పెట్టి ఒత్తిడికి గురిచేశారని ఉద్యోగుల సంఘం నాయకులు వాపోతున్నారు.

● మధ్యాహ్న భోజనం, ఆన్‌లైన్ హాజరు నమోదు, మరుగుదొడ్ల శుభ్రత ఫొటోలు అప్‌లోడ్, నాడు-నేడు పనుల బాధ్యతతో టీచర్లపై పనిభారం పెరిగింది.

● వైసీపీ ప్రభుత్వ పాలనలో ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ కూడా భారంగా మారింది. వాటిని నిధులు కేటాయించకపోవడంతో సుద్దముక్కలు, రిజిస్టర్లు, డస్టర్లు ఇతర సామగ్రి కొనగోలుకు కొందరు ఉపాధ్యాయులు, హెచ్‌ఎంలు చేతి డబ్బులను వెచ్చించాల్సిన దుస్థితి నెలకొంది. ఏటా సమగ్ర శిక్ష ద్వారా విద్యార్థుల సంఖ్యను బట్టి స్కూళ్లకు నిధులు మంజూరు చేసేవారు. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పరిస్థితి లేదు.

● ప్రభుత్వం నుంచి సకాలంలో బిల్లుల చెల్లింపులు కాక.. ఎంతోమంది ఉద్యోగులు తమ శుభ కార్యాలు, పిల్లల చదువులకు అప్పులు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది.

పీఆర్సీ ఇలా..

వైసీపీ ప్రభుత్వం 11వ పీఆర్సీలో ఉద్యోగులను మోసం చేసిందని చెప్పవచ్చు. ఎప్పుడూ లేని విధంగా మధ్యంతర భృతి 27 శాతం ఉంటే దాన్ని నాలుగు శాతాలను తగ్గించి 23 శాతం ఫిట్మెంట్ ఇచ్చింది. దీంతో ఐఆర్‌తో తీసుకున్న జీతం కంటే ఫిట్మెంట్‌తో తీసుకున్న జీతం తగ్గిపోయింది. దీనిపై కూడా ప్రభుత్వ ఉద్యోగులు ఆందోళన చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. పీఆర్సీ సిఫారసు చేసిన పేస్కేలును పూర్తిస్థాయిలో అమలు చేయకుండానే 12వ పీఆర్సీ కమిషన్‌ను వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ కమిషన్‌ను వేసినప్పటికీ ఇంతవరకు ఎటు వంటి కార్యకలాపాలు చేపట్ట లేదు. వాస్తవంగా 2023, జూలై నుంచి కొత్త పీఆర్సీ కమిషన్ అమలు కావాలి. ఇదిలా ఉండగా ప్రతి సారీలానే వైసీపీ సర్కారు ఐఆర్‌కూ మంగళం పాడేసింది. దీనిపై ఉద్యోగుల సంఘాల నాయకులు నేటికీ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నమ్మి మోసపోయాం..

అధికారంలోకి వచ్చిన వారంలోగా సీపీఎస్ రద్దు చేస్తామన్న జగన్ మాట నమ్మి మోసపోయాం. సీపీఎస్‌తో ఉద్యోగుల భద్రతకు ముప్పు. ఉద్యోగ విరమణ తరువాత పరిస్థితి దయనీయంగా ఉంటుంది. ఉద్యోగుల సర్వీసుకు గుర్తింపు లేకపోవడం బాధాకరం.

-ఓ సంఘం నాయకుడు, పార్వతీపురం

సమస్యలేవీ పరిష్కరించ లేదు..

గత ఎన్నికల్లో ప్రతిపక్ష నేతగా జగన్ మాటలు నమ్మి వైసీపీకి ఓటేశాం. అయితే దారుణంగా మోసపోయాం. ఐదేళ్ల కాలంలో ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలేవీ వైసీపీ సర్కారు పరిష్కరించలేదు. సీపీఎస్ రద్దు రద్దు చేయకపోవడంతో జగన్ ఇచ్చిన మాట నీటిమూటగా మారింది. ఇతర బకాయిలు కూడా చెల్లించలేదు.

-ఓ ప్రభుత్వ ఉద్యోగి, పార్వతీపురం

జీతాలకు ఎదురుచూపులు..

గత ప్రభుత్వాల హయాంలో ఎన్నడూ లేని విధంగా వైసీపీ సర్కారు పాలనలో జీతాల కోసం ఎదురుచూడాల్సి వచ్చింది. ప్రతినెలా ఒకటో తేదీకే జీతాలు చెల్లించాలని రోడ్డెక్కాల్సి వచ్చింది. పెన్షన్‌దారులకు సైతం సకాలంలో పెన్షన్లను అందించలేక పోయారు. మరోవైపు సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేస్తామన్న సీఎం జగన్ మాట మార్చి- మడమ తిప్పారు. జీపీఎస్ అని కొత్తగా తెరపైకి తెచ్చి ఉద్యోగ, ఉపాధ్యాయులను మోసం చేశారు.

-ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు, పార్వతీపురం

వారం రోజులుగా..

● పాలకొండలో నిలిచిన రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ● సాంకేతిక సమస్యే కారణమంటున్న సిబ్బంది

పాలకొండ: డివిజన్ కేంద్రం పాలకొండలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజి స్ట్రేషన్ ప్రక్రియ నిలిచిపోయింది. గత వారం రోజులుగా ఇదే పరిస్థితి నెలకొనడంతో క్రయ, విక్రయాలు కోసం వచ్చిన వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాగా సాంకేతిక సమస్యతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిలిచిపోయినట్టు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది చెబుతున్నారు. వాస్తవంగా ఇప్పుడు మంచి ముహూర్తాలు ఉన్నాయి. అత్యధికులు భూములు, స్థలాలు, భవనాలు, ఇతర వాణిజ్య సముదాలయాల అమ్మకాలు, కొనుగోలుకు సంబంధించి ఈ సమయంలోనే రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. దీంతో రోజూ సరాసరి 20 నుంచి 30 డాక్యుమెంట్లు కోసం దరఖాస్తు చేసుకుం టున్నారు. అయితే సాంకేతిక సమస్యతో రిజిస్ట్రేషన్ ప్ర క్రియ ముందుకు సాగడం లేదు. చేసేది లేక కొంత మంది వేరే ప్రాంతాల్లో ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాల యాలను సంప్రదించి రిజిస్ట్రేషన్ తంతును చేపడు తున్నారు. మరికొంతమంది వేరే ప్రాంతాలకు వెళ్లలేక స్థానిక కార్యాలయంలో పడిగాపులు కాస్తున్నారు. ఏదేమైనా సర్వర్ సమస్య వారం రోజులుగా ఉన్నప్పటికీ దాన్ని రిజిస్ట్రార్ శాఖ పరిష్కరించకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై ఉన్నతాధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియకు సాంకేతిక సమస్య ఎదురవుతుంది. ప్రధానంగా చలానా స్కాన్ చేసే సమయంలో సేవ్ కావడం లేదు. దీంతో డాక్యుమెంట్ ప్రక్రియను కొనసాగించలేకపోతున్నాం. ఈ విషయమై విజయవాడలోని ఐజీ కార్యాలయానికి సమాచారం అందించాం. సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నాం.

- సత్యనారాయణమూర్తి,
సబ్ రిజిస్ట్రార్, పాలకొండ

నామినేషన్ల పరిశీలన పూర్తి

పార్వతీపురం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి)/ కురుపాం/ సీతంపేట/ సాలూరు రూరల్: జిల్లాలో శుక్రవారం నామినేషన్ల పరిశీలన ప్రక్రియ సజావుగా పూర్తయింది. అరకు పార్లమెంట్, నాలుగు శాసనసభ స్థానాలకు దాఖలైన నామినేషన్లను పరిశీలించారు. అయితే అరకు పార్లమెంట్ పరిధిలో 32 నామినేషన్లు పడగా.. ఇందులో ఎనిమిది మంది నామినేషన్లను వివిధ కారణాలతో తిరస్క రించారు. నాలుగు నియోజకవర్గాల్లో మొత్తంగా 61 నామినేషన్లు దాఖలవగా.. పాలకొండలో 10 మందికి గాను ఇద్దరి నామినేషన్లను తిరస్కరించి నట్లుగా ఎన్నికల ఆర్వో శుభం బన్సాల్ తెలిపారు. నామినేషన్లు వేసిన అన్ని పార్టీలకు చెందిన అభ్యర్థులతో శుక్రవారం సీతంపేట ఐటీడీఏ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసి ఈ విషయాన్ని ఆయన వెల్లడించారు. మిగతా పది మంది అభ్యర్థుల నామినేషన్లు సక్రమంగా ఉన్నాయన్నారు. పార్వతీపురం నియోజకవర్గానికి సంబంధించి పది మంది నామినేషన్లు ఆమోదించగా మరో ముగ్గురి నామినేషన్లను తిరస్కరించారు. కురుపాంలో ఆర్వో వీవీ రమణ ఆధ్వర్యంలో అభ్యర్థుల నామినేషన్లను పరిశీలించారు. 11 నామినేషన్లకు గాను మూడింటిని తిరస్కరించారు. ఎనిమిది మందివి ఆమోదించారు. సాలూరు నియోజకవర్గానికి దాఖలైన నామినేషన్లను అభ్యర్థులు, వారి ప్రతినిధుల సమక్షంలో ఆర్వో విష్ణుచరణ్ పరిశీలించారు. మొత్తంగా పది నామినేషన్లకు గాను రెండు నామినేషన్లను తిరస్కరించారు. నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ముగిసిన తర్వాత తుది జాబితాను అధికారులు ప్రకటించనున్నారు.

విధి నిర్వహణలో

అప్రమత్తంగా ఉండాలి

● రాష్ట్ర ఎన్నికల పోలీస్ అబ్జర్వర్ దీపక్‌మిశ్రా

పార్వతీపురం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల నేపథ్యంలో ప్రతిఒక్కరూ విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ఎన్నికల పోలీస్ అబ్జర్వర్ దీపక్ మిశ్రా అన్నారు. పారదర్శకంగా పని చేసి ప్రజాస్వామ్యం గొప్పదనాన్ని కాపాడాలని సూచించారు. జిల్లాలో శుక్రవారం పర్యటించిన ఆయన కలెక్టరేట్‌లో పోలీసులు, ఉన్నతాధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల విధుల్లో తప్పులు చేస్తే ఉద్యోగ జీవితంలో ఇబ్బందులు ఎదురవుతాయని తెలిపారు. చిన్న చిన్న పొరపాట్లుకు కూడా తావివ్వకుండా విధులు నిర్వహించాలని సూచించారు. అనంతరం కలెక్టర్ నిశాంత్‌కుమార్ మాట్లాడుతూ.. జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు వీలుగా అన్ని చర్యలు చేపట్టామన్నారు. గరుగుబిల్లి మండలం ఉల్లిభద్ర ఉద్యాన కళాశాలలో జిల్లాలోని నాలుగు నియోజక వర్గాల కౌంటింగ్ ఏర్పాటు చేశామని చెప్పారు. అరకు పార్లమెంట్‌కు సంబంధించి పాడేరు, రంపచోడవరంలోను కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పోలీస్‌శాఖ పరంగా చేపట్టిన వివరాలను ఎస్పీ విక్రాంత్ పాటిల్ వివరించారు. ఈ సమావేశంలో అదనపు డీజీపీ శంకబ్రత బాగ్చి, ఎన్నికల పరిశీలకులు ప్రమోద్ కుమార్, నయీం ముస్తఫా మన్సూరి, విశాఖ రేంజ్ డీఐజీ విశాల్ గున్ని, జేసీ శోభిక, ఏఎస్పీ దిలీప్ కిరణ్ తదితరులు ఉన్నారు.



కలెక్టరేట్‌లో అధికారులు, పోలీసులతో సమీక్షిస్తున్న దీపక్ మిశ్రా

గిరి ప్రోత్సాహం ఏదీ?



పూతికవలస ఆశ్రమ పాఠశాల

● ఆశ్రమ పాఠశాలల్లో నిలిచిపోయిన పథకం
● పారిశుధ్య సేవలు, వేసవి శిక్షణ శిబిరాలకు నిధులు కేటాయించని సర్కారు
● టీడీపీ ప్రభుత్వ హయాంలో అమలు
● వైసీపీ పాలనలో మంగళం

(సీతంపేట)

'నా ఎస్టీలు.. నా ఎస్సీలు .. అంటూ పదే పదే చెప్పుకునే సీఎం జగన్ ఐదేళ్ల పాలనలో మాత్రం ఆచరణలో మాత్రం భిన్నంగా వ్యవహరించారు. ప్రధానంగా గిరిజనుల అభివృద్ధికి గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన పథకాలకు మంగళం పాడేశారు. పైగా గిరిపుత్రుల కోసం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నట్లుగా ప్రకటనలతో ఊదరగొట్టారు. దీంతో జిల్లా పరిధిలో ఏజెన్సీ వాసులు మండిపడుతున్నారు. వైసీపీ సర్కారు తీరుపై పెదవి విరుస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

వాస్తవంగా గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏల పరిధిలోని ఆశ్రమ పాఠశాలల్లో గిరిజన విద్యార్థులకు గిరి ప్రోత్సాహం కింద రూ.500 అందజేసేవారు. దసరా పండగ సెలవుల అనంతరం ఒకటి, రెండు రోజుల్లో పాఠశాలలకు తిరిగి రావడానికి వీలుగా గిరి ప్రోత్సాహం పథకాన్ని 2017లో ప్రయోగాత్మకంగా అమలు చేశారు. గిరిజన విద్యార్థుల డ్రాపౌట్స్ తగ్గించాలని ఉద్దేశంతో ఈ పథకం అమలు చేశారు. సీసీడీపీ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ నుంచి నిధుల కేటాయించారు. ఈ పథకం ద్వారా గిరిజన విద్యార్థుల విద్యా ప్రమాణాలు ఎంతగానో మెరుగుపడగా, డ్రాపౌట్ శాతం భారీగా తగ్గింది. దీంతో తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను సకాలంలో ఆశ్రమ పాఠశాలలకు పంపించేందుకు మొగ్గు చూపేవారు. ఈ పథకం ద్వారా సీతంపేట ఐటీడీఏలో 2018-19లో 4,230 మంది విద్యార్థులకు, 2017-18లో 4,828 మంది మందికి ప్రోత్సాహకాల కింద రూ.67 లక్షలు అందించారు. అయితే 2019 తర్వాత సీన్ మారింది. అధికారంలోకి వచ్చిన వైసీపీ.. ఆ పథకాన్ని అటకెక్కించింది. నిధులు సమకూర్చడం మానేసింది. దీంతో ఆ పథకం అర్థాంతరంగా నిలిచిపోయింది. మొత్తంగా నిధుల లేమితో గిరి ప్రోత్సాహాన్ని నిలుపుదల చేశారు.

పారిశుధ్య సేవలకు బ్రేక్..

సీతంపేట ఐటీడీఏ పరిధిలో 18 గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, గురుకులాల్లో పారిశుధ్య పనులకు గాను గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 8 మంది గిరిజన యువతను నియమించారు. ఒక్కొక్కరికీ రూ.5 వేల చొప్పున గౌరవ వేతనం ఇచ్చి మరుగుదొడ్ల నిర్వహణ చేయించేవారు. 2018-19లో సీసీడీపీ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం కింద పైలెట్ ప్రాజెక్టులో భాగంగా పలు పాఠశాలలను దత్తత తీసుకుని పారిశుధ్య మెరుగు చర్యలు చేపట్టారు. అయితే నిధులు లేవనే సాకుతో వైసీపీ ప్రభుత్వం ఈ పథకాన్ని కూడా నిలుపుదల చేసింది. మరుగుదొడ్ల నిర్వహణకు నియమించిన వారిని కూడా తొలగించారు. దీంతో ప్రస్తుతం ఆశ్రమ పాఠశాలల, గురుకులాల్లో పారిశుధ్య నిర్వహణ అంతంత మాత్రంగానే ఉందనే ఆరోపణలు ఉన్నాయి.

కానరాని వేసవి శిక్షణ శిబిరాలు...

వేసవి సెలవుల్లో గిరిజన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ అందిస్తే స్వయం ఉపాధి అవకాశాలు కలుగుతాయనే ఉద్దేశంతో గత టీడీపీ ప్రభుత్వం ప్రత్యేక శిబిరాలను నిర్వహించేంది. ఈ మేరకు గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు వేసవి శిక్షణా శిబిరాన్ని ఏర్పాటు చేసేవారు. ప్రత్యేకంగా స్పోకెన్ ఇంగ్లిష్, గణితం, డ్రాయింగ్, పెయింటింగ్‌పై శిక్షణ తరగతులు నిర్వహించేవారు. అబాకాస్ కుట్లు, అల్లికలు, కూచిపూడి, భరతనాట్యం వంటి వాటిల్లో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల బాలికలకు శిక్షణ ఇచ్చేవారు. అప్పట్లో సుమారు 568 మంది విద్యార్థులు ప్రయోజనం పొందే విధంగా చర్యలు తీసుకున్నారు. వైసీపీ ప్రభుత్వం వేసవి శిక్షణ శిబిరాలకు కూడా మంగళం పాడేసింది. నిధులు సమకూర్చకపోవడంతో గడిచిన ఐదేళ్లుగా వాటిని నిర్వహించడం లేదు. దీంతో వైసీపీ సర్కారు తీరుపై గిరిజన విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై గిరిజన సంక్షేమశాఖ డీడీని వివరణ కోరగా.. ప్రస్తుతం వేసవి శిక్షణ వంటి పథకాలేవీ అమలు కావడం లేదని స్పష్టం చేశారు.

పీపుల్స్ మేనిఫెస్టో

ఉపాధి అవకాశాలు కల్పించాలి



గరుగుబిల్లి: యువతకు తగిన ఉపాధి అవకాశాలు కల్పిస్తే నిరుద్యోగ సమస్య తగ్గుతుంది. ఈ ఐదేళ్లలో ఉపాధి అవకాశాలు లేక వేరే రాష్ట్రాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నా దృష్టి సారించడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యా సౌకర్యాలు మెరుగుపర్చాలి. యువతకు ఉన్నత విద్య మరింత చేరువ కావాలి. విద్యార్థులకు అనువైన ఉద్యోగ అవకాశాలు ఉన్నప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుంది. ఉపాధి అవకాశాలు పూర్తిస్థాయిలో కల్పించే ప్రభుత్వాలకు మా మద్దతు ఉంటుంది.

- అక్కెన నారాయణరావు, సాంబన్నవలస, గరుగుబిల్లి మండలం

ఎన్నికల ఫిర్యాదులకు కంట్రోల్ రూమ్

● విజయనగరం జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి

కలెక్టరేట్: ఎన్నికల ఫిర్యాదుల కోసం కంట్రోల్ రూంలో ల్యాండ్ లైన్ 08922-797120, 08922-797124 నెంబర్లను ఏర్పాటు చేసినట్లు విజయనగరం జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెంబర్లకు ఫోన్ చేసి.. మోడల్ కోడ్ ఉల్లంఘనపై ఫిర్యాదులు చేయవచ్చని.. ఎన్నికల సమాచారాన్ని పొందవచ్చునని చెప్పారు. ఎన్నికల ఫిర్యాదులను ప్రజా యాప్ సివిజిల్ ద్వారా కూడా స్వీకరిస్తున్నామని తెలిపారు. ఈ యాప్ కోసం ఆండ్రాయిడ్ ఫోన్‌లో కెమెరా ఆప్షన్ ఉండాలన్నారు. ఫొటోలు, ఆడియో, వీడియోలను, మోడల్ కోడ్ ఉల్లంఘన లైవ్ రిపోర్టింగ్‌ను ఈ యాప్ ద్వారా పంపవచ్చునని తెలిపారు. ముందుగా రికార్డ్ చేసి ఫొటోలు, వీడియోలు, ఈ యాప్‌లో అనుమతించబడవని పేర్కొన్నారు. ఫిర్యాదు అందించిన 100 నిమిషాల్లో క్షేత్ర స్థాయిలో విచారించి... సంబంధిత అధికారులు చర్యలు తీసుకుంటారని తెలిపారు. ఫిర్యాదు దారు పేరు, ఫోన్ నెంబరు రాయవచ్చని... లేకపోయినా ఫిర్యాదును స్వీకరించి.. చర్యలు తీసుకుంటారని తెలిపారు. ఫిర్యాదుల కోసం 1950 టోల్ ఫ్రీ నెంబరు కూడా ఉందని తెలిపారు.

ఎన్నికల వరకే రాజకీయాలు చేయాలి

పెద్దల మాట



సాలూరు రూరల్: ఎన్నికల వరకే పార్టీలు, నాయకులు రాజకీయాలు చేయాలి. ఎన్నికలు ముగిసిన తరువాత అభివృద్ధిపై శ్రద్ధ చూపాలి. గతంలో ఎన్నికల ప్రచారం పెద్దగా హడావుడి లేకుండా సాగేది. ప్రచారశైలిలో ప్రస్తుతం మార్పులు చూస్తున్నాం. నామినేషన్‌కే ప్రస్తుతం ఆర్భాటం చేయాల్సిన పరిస్థితులు వచ్చాయి. నాయకులు, కార్యకర్తల వ్యవహార శైలిలో మార్పులు వచ్చాయి. శుభకార్యాలు, పండుగ శుభాకాంక్షల ఫ్లెక్సీలపై పార్టీ నేతల ఫొటోలు ముద్రిస్తున్న పరిస్థితులు వచ్చాయి. కాలంతో పాటు పార్టీల తీరు మారుతోంది. ప్రతి ఒక్కరు ఓటు వినియోగించడానికి అప్పుడు ప్రాధాన్యమిచ్చేవారం. ఈ ఎన్నికల్లో సైతం ఓటు వేయడానికి ప్రాధాన్యమిస్తాను.

- నరేళ్ల రామారావు (88), సాలూరు



ఓటేయడానికి గుర్తింపు కార్డులివే

(చీపురుపల్లి)

పోలింగ్ రోజున ప్రతి ఓటరూ తమతో బాటు పోలింగ్ స్టేషన్‌కు విధిగా వ్యక్తిగత గుర్తింపు కార్డును తీసుకెళ్లాలి. లేని పక్షంలో ఎన్నికల అధికారులు ఓటును తిరస్కరించడానికి అవకాశం ఉంది. ఓటరు తమకు నచ్చిన లేదా తమ వద్ద అందుబాటులో ఉన్న గుర్తింపు కార్డును తీసుకెళ్తే కుదరదు. ఓటరు తమతో పాటు ఎటువంటి గుర్తింపు కార్డును తీసుకుని వెళ్లాలో ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. ఈ 11 రకాల కార్డులను మాత్రమే ఎన్నికల అధికారులు పరిగణనలోకి తీసుకుంటారు. దీని ప్రకారం..



- ఓటరు ఫొటో గుర్తింపు కార్డు (ఈపీఐసీ)
- పాస్‌పోర్టు
- డ్రైవింగ్ లైసెన్సు
- సర్వీసు గుర్తింపు కార్డు (కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వాలు/ పీఎస్‌యూలు/ పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలు తమ ఉద్యోగులకు జారీ చేసినవి)
- పాస్‌బుక్ (ఫోటోతో బాటు బ్యాంకు/పోస్టాఫీస్‌లో జారీ చేసినవి)
- పాన్ కార్డు, ఆధార్ కార్డు
- స్మార్ట్ కార్డు (కార్మిక మంత్రిత్వ శాఖ పథకం కింద జారీ చేసినవి)
- ఎంఎన్ఆర్ఈజీఎస్ జాబ్ కార్డు
- ఆరోగ్య బీమా స్మార్ట్ కార్డు (కార్మిక మంత్రిత్వ శాఖ పథకం కింద జారీ చేసినవి)
- ఫొటో పింఛన్ పత్రం
- అధికారిక గుర్తింపు కార్డు (ఎంపీలు/ఎంఎల్ఏలు/ఎంఎల్‌సీలకు జారీ చేసినవి)

బడ్డుకొండంత.. హామీలు!



పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించిన కొండ ప్రాంతం



● టేబుళ్ల మీదే ప్రతిపాదనలు
● మళ్లీ ఎన్నికలకు సిద్ధంపై సర్వత్రా విమర్శలు

(నెల్లిమర్ల)

గడిచిన ఐదేళ్లుగా నెల్లిమర్ల నియోజకవర్గం ఎమ్మెల్యేగా వ్యవహరించిన బడ్డుకొండ అప్పలనాయుడు ఇచ్చిన హామీలు కలగానే మిగిలిపోయాయి. ఆయన చెప్పిన మాటలు నేటికీ నియోజక వర్గ ప్రజల చెవుల్లో గింగిర్లు కొడుతూనే ఉన్నాయి. ఆయన ప్రతిపాదించిన ఫైళ్లు టేబుళ్లపై నుంచి కదలలేదు. ఇప్పుడు మళ్లీ ఎన్నికలు వచ్చేశాయి. కొత్తగా హామీలు ఇవ్వడం మొదలుపెట్టారు. ఓటర్లను తన వైపు తిప్పుకునేందుకు కొత్త పంథాలపై కసరత్తు చేస్తున్నారు.

ప్రత్యామ్నాయ ఇళ్ల స్థలాలేవీ..?

నెల్లిమర్ల నగర పంచాయతీలోని సుమారు 1400 మంది పేదలకు అందరికీ ఇళ్లు పథకంలో భాగంగా జగనన్న కాలనీ ఇస్తామని అప్పట్లో ఎమ్మెల్యే బడ్డుకొండ ప్రకటించారు. పట్టాలు కూడా పంపిణీ చేశారు. ప్రభుత్వం కేటాయించిన స్థలం కొండ ప్రాంతం కావడంతో లబ్ధిదారులు ఆ స్థలాన్ని వద్దని తిరస్కరించారు. అప్పటి నుంచి గత మూడేళ్లుగా ప్రత్యామ్నాయ స్థలం చూపిస్తామని చెప్పడమే తప్ప.. కొత్తగా ఎక్కడా స్థలాన్ని చూపించలేదు. లబ్ధిదారులు చేతుల్లో ఇప్పటికీ పట్టాలు మాత్రమే ఉన్నాయి. స్థలం మాత్రం పొందలేకపోయారు.



ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

మరికొన్ని ప్రతిపాదనల వరకే..

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి 2023 మే 3న విమానాశ్రయం శంకుస్థాపనకు భోగాపురం వచ్చినపుడు ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అభ్యర్థన మేరకు పలు అభివృద్ధి పనులు మంజూరు చేస్తున్నట్లు సభా వేదిక పైనుంచే ప్రకటించారు. ఇంత వరకు ఆ పనులు కాగితాలను దాటలేదు. నెల్లిమర్ల మండలంలోని గరికిపేట నుంచి తుమ్మలపేట వరకు, కొండవెలగాడ నుంచి రోళ్లవాక వరకు తారు రోడ్డు నిర్మాణాలకు నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఇంతవరకు ఆ పనులు ప్రారంభం కాలేదు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం గ్రామం మధ్య నుంచి వెళ్తున్న నెల్లిమర్ల-శ్రీకాకుళం రాష్ట్ర రహదారికి బదులుగా రామతీర్థం బోడికొండను ఆనుకుని బైపాస్ నిర్మాణం చేస్తామని గత టీడీపీ ప్రభుత్వ హయాంలో వచ్చిన ప్రతిపాదనను ఎమ్మెల్యే బడ్డుకొండ తాను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి పూర్తి చేయిస్తానని చెప్పారు. ఇంత వరకు అమలు చేయలేదు. ఇలా చెప్పుకుంటూ పోతే ఎమ్మెల్యేగా బడ్డుకొండ ఎన్నో హామీలు ఇచ్చినా పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోలేదు. ఈ ఐదేళ్లలో చేసిన అభివృద్ధి ఏమీ లేకపోయినా మళ్లీ ఎన్నికలకు సిద్ధమంటుండడంపై నియోజకవర్గ ప్రజలు విమర్శిస్తున్నారు.

తారకరామ పూర్తయ్యేదెప్పుడో..

నెల్లిమర్ల మండలం సారిపల్లి గ్రామం వద్ద నిర్మాణ దశలో ఉన్న తారకరామ రిజర్వాయర్ తన హయాంలో పూర్తిచేసి సాగునీరు అందిస్తానని ఇచ్చిన మాట అలాగే ఉండిపోయింది. నిర్మాణం ఇప్పటికీ కొన... సాగుతూనే ఉంది. సాగునీటి కోసం డెంకాడ, భోగాపురం, పూసపాటిరేగ మండలాలకు చెందిన రైతులు కళ్లల్లో ఒత్తులు వేసుకుని ఎదురుచూస్తున్నారు. రిజర్వాయర్ నిర్మాణం 2007లో ప్రారంభమై నేటికీ కొనసాగుతూనే ఉంది. ముంపు బాధితుల సమస్యలు తీర్చలేదు. వారికి నష్టపరిహారం చెల్లింపు కూడా పూర్తి చేయలేదు. నిర్వాసిత గ్రామాల నిర్మాణానికి ఇంత వరకు స్థల సేకరణే జరగలేదు. ముంపు బాధితులు తమ పొలాలను కోల్పోయి ఉపాధి లేక అల్లాడుతున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే దాదాపు 25 వేల ఎకరాలకు సాగునీటితోపాటు విజయనగరం, నెల్లిమర్ల తదితర ప్రధాన పట్టణాలకు తాగునీటి సమస్య పరిష్కారం అవుతుంది. ఈ సమస్యలన్నీ ముఖ్యమంత్రి జగన్ దృష్టి తీసుకుని వెళ్లి పరిష్కరిస్తానని చెప్పి.. గత ఎన్నికల్లో గెలిచిన ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు నేటికీ వాటిని పరిష్కరించలేకపోవడం విశేషం. ఆ సమస్యలు అలాగే ఉన్నా... మళ్లీ ఎన్నికల్లో గెలిచేందుకు కొత్త హామీలు గుప్పిస్తున్నారని సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.



నత్తనడకన నిర్మాణం సాగుతున్న తారకరామ రిజర్వాయర్



బైపాస్ నిర్మాణానికి ప్రతిపాదించిన బోడికొండ ప్రాంతం

కొత్త జిల్లా.. పాత కష్టాలు

● ఇదీ భామిని మండలంలో పరిస్థితి



వాహనం వెనుక వెళ్తే ఇంతే..

(భామిని)

ఆంధ్రా, ఒడిశా సరిహద్దులోని మండలాల్లో అభివృద్ధి కనిపించడం లేదు. భామినిలో విద్యా సంస్థలు మినహా మరే అభివృద్ధి కానరావడం లేదు. ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామన్న వైసీపీ పాలకుల మాటలు నీటి మూటలయ్యాయి. ఎప్పటిలాగానే అవి ఎన్నికల హామీలుగానే మిగిలిపోయాయి. పార్వతీపురం మన్యం జిల్లాలో విలీనం చేసినప్పటి నుంచి మండల ప్రజలు అసంతృప్తిగానే ఉన్నారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో ఉన్న సమస్యలే ఇప్పటికీ వెంటాడుతున్నాయనే భావన ప్రజల్లో ఉంది. మన్యం జిల్లాగా ఆవిర్భవించిన తర్వాత ఒక్కటంటే ఒక్క సమస్య పరిష్కారం కాలేదని ప్రజలు వాపోతున్నారు. వంశధార నది నుంచి నీరు సముద్రం పాలవుతోంది తప్ప వినియోగించడం లేదు. పంట పొలాలు వరదలకు నదీ గర్భాల్లో కలిసిపోతున్నాయి. దీనితో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. వంశధార నది వల్ల ఎటువంటి ఫలితం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. గత ప్రభుత్వంలో కాట్రగడ వద్ద డ్రిప్ ఇరిగేషన్ మంజూరు చేసినా..అది కార్యరూపం దాల్చేందుకు వైసీపీ ప్రభుత్వం ఎటువంటి చర్యలు చేపట్టలేదని ఈ ప్రాంతీయులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. కొత్తూరు నుంచి బత్తిలి వరకు 30 కిలోమీటర్ల మేర ఉన్న ప్రధాన రహదారి మరమ్మతుకు గురైనా పట్టించుకొనే నాథుడే లేరని ప్రయాణికులు ప్రభుత్వంపై మండి పడుతున్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో మండలాన్ని కలిపినా ఆర్టీసీ బస్సు జిల్లా కేంద్రానికి ఏర్పాటు చేయలేదు. అలా అని డివిజన్ కేంద్రమైన పాలకొండకు కూడా బస్సు సౌకర్యం లేదు. వైద్యసేవల కోసం గర్భిణులు ఇప్పటికీ పొరుగు జిల్లాలోని కొత్తూరు పీహెచ్‌సీకి వెళ్లాల్సిందే. ఇలా అడుగుకో సమస్య ప్రజలను వేధిస్తున్నాయి. అన్నిటినీ వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది.



కాట్రగడ వద్ద ఎత్తిపోతల పథకం నిర్మాణానికి వేసిన శిలాఫలకం



అధ్వానంగా ఉన్న అలికాం-బత్తిలి రహదారి

ఎన్నికల పరిశీలకులకు ఫిర్యాదు చేయాలంటే...

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: పార్లమెంటరీ నియోజకవర్గ సాధారణ పరిశీలకులుగా ప్రమోద్‌కుమార్ మెహర్దను ఎన్నికల సంఘం నియమించింది. ఆయన జిల్లాకు చేరుకున్నారు. పోలీసు అతిథి గృహంలో బస చేస్తున్నారు. పరిశీలకుల ఫోన్ నెంబర్ 75698 98830. పరిశీలకుల సమన్వయ అధికారిగా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ ఎం.డి.నాయక్ 94944 27717 వ్యవహరిస్తున్నారు. వీరికి నిబంధనల ఉల్లంఘనపై ఫిర్యాదులు చేయవచ్చు.

పోలీసు పరిశీలకులకు...

పార్లమెంటరీ నియోజకవర్గ పోలీసు పరిశీలకులుగా నయీంముస్తఫా మన్సూరిని ఎన్నికల సంఘం నియమించింది. ఆయన జిల్లాకు చేరుకున్నారు. పోలీసు అతిథి గృహంలో బస చేస్తున్నారు. పోలీసు పరిశీలకుల ఫోన్ నెంబర్ 75698 20106. పరిశీలకుల సమన్వయ అధికారిగా జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ఎల్.అశోక్‌కుమార్ 9182361384 వ్యవహరిస్తున్నారు. ఎన్నికల్లో శాంతిభద్రతల సంబంధిత అంశాలపై అరకు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో నియోజకవర్గాల సమాచారం, ఫిర్యాదులు వీరికి సమర్పించవచ్చునని ఎన్నికల అధికారి నిశాంత్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

ఎన్నికల గుర్తులు ఎలా వచ్చాయంటే..

(కొమరాడ)



భారతదేశంలో 1952లో జరిగిన తొలి ఎన్నికల సమయానికి అక్షరాస్యత 16 శాతమే ఉండేది. దీంతో ఓటర్లు ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల పేర్లను గుర్తించడం కష్టతరం కాబట్టి సులభంగా గుర్తించేందుకు వీలుగా బ్యాలెట్ పత్రంలో గుర్తులను ఉంచాలని నిర్ణయించారు. ఇందుకుగాను 1950లో ప్రముఖ చిత్రకారుడు ఎంఎస్ సేఠితో పెన్సిల్‌తో చిత్రాలను గీయించి.. వాటిలో గుర్తులను ఎన్నికల బ్యాలెట్ పత్రంలో ఉపయోగించుకున్నారు. అలా వివిధ రకాలుగా ఆధునికతను సంతరించుకుని ఎన్నికల గుర్తులు రూపొందాయి. ఎంఎస్ సేఠి 2000వ సంవత్సరంలో కన్ను మూశారు. ఇదిలా ఉండగా కేంద్ర ఎన్నికల కమిషన్ గుర్తింపు పొందిన జాతీయ, ప్రాంతీయ రాజకీయ పార్టీలకు వారు ఎంచుకున్న గుర్తులను కేటాయించేది. వివిధ రాజకీయ పార్టీల తరుపున బీ-ఫారం సమర్పించి... పోటీ చేసే వారికి ఆ పార్టీ గుర్తులను కేటాయించారు. ఈవీఎంలు వచ్చాక గుర్తులతో పాటు అభ్యర్థి పేరు, ఫొటోతో పాటు కేటాయించిన గుర్తును అందుబాటులో ఉంచారు.

ఇంటి వద్దకే ఓటు

విజయనగరం (ఆంధ్రజ్యోతి)



తాజా ఎన్నికలకు సంబంధించి భారత ఎన్నికల సంఘం ఓ నిర్ణయం తీసుకుంది. 85 ఏళ్ల దాటిన వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులకు ఇంటి వద్దనే ఓటు వేసే అవకాశాన్ని కల్పించింది. వీరు పోలింగ్ కేంద్రానికి వెళితే సరే.. లేదంటే.. అధికారులు ఇంటి వద్దకే వచ్చి వారి ఓటును వినియోగించుకునే విధంగా రూపకల్పన చేసింది. సర్వేలో గుర్తించిన వారి ఇళ్లకు పోలింగ్ అధికారులు వెళ్లి వారి దగ్గర ఉండి.. ఓటేసేలా చర్యలు చేపడుతున్నారు. తొలి విడతగా మే నెలలో 7, 8 తేదీల్లో జరగనుంది. ఈ రెండు తేదీల్లో ఓటేయలేని వారికి మరోసారి అదే నెలలో 9, 10 తేదీల్లో ఓటేసేలా ఎన్నికల సంఘం ప్రణాళిక రూపొందించింది. రెండు విడతల్లో జరిగే ఈ కార్యక్రమంలో ఏఆర్ఓ పర్యవేక్షణాధికారిగా వ్యవహరిస్తారు. ఏఆర్ఓకు సహాయకులుగా సెక్టోరియల్ అధికారులు, బీఎల్ఓలు, పోలీసు సిబ్బందితో పాటు వీడియోగ్రాఫర్లు, పోలింగు కేంద్రాల పరిధిలోని ఏజెంట్లు ఉంటారు.

జిల్లాలో ఇలా..

ప్రస్తుతం విజయనగరం జిల్లాలో 85 ఏళ్ల దాటిన వృద్ధులు 7,181 మంది ఉన్నారు. విభిన్న ప్రతిభావంతులు 21,993 మంది ఉన్నారు. వీరంతా పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వేస్తారా? కుదరకపోతే, ఇంటివద్దే ఓటేస్తారా అనే వివరాలను ఎన్నికల సెక్టోరియల్ అధికారులు సర్వే చేశారు. ఇలాంటి వారి కోసం ఎన్నికల సంఘం ప్రత్యేకంగా పోలింగ్ సిబ్బందిని నియమించింది.

జన కేతనం



ఆంధ్రజ్యోతి

శనివారం 27 ఏప్రిల్ 2024

ఏజెంట్లే కీలకం

(కొమరాడ)

ఎన్నికల రోజు పోలింగ్ కేంద్రాల్లో అభ్యర్థుల తరఫున పరిశీలనకు కూర్చునే ఏజెంట్ల పాత్ర అత్యంత కీలకం. అభ్యర్థులు నెలల తరబడి నిర్వహించిన ప్రచారం, ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు పడిన కష్టానికి ఫలితం ఇచ్చేది పోలింగ్ కేంద్రమే. అటువంటి కేంద్రంలో పోలింగ్ సక్రమంగా జరుగుతుందా? లేదా? అన్నది గమనించడం, బోగస్ ఓట్లు పడకుండా ఓటు వేయడానికి వచ్చిన వారిని నిశితంగా పరిశీలించడం ఏజెంట్ల పని. గుర్తింపు పొందిన, రిజిస్టర్డ్ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థుల తరుపున ప్రాధాన్య క్రమంలో ఏజెంట్లు పోలింగ్ కేంద్రాల్లో కూర్చుంటారు. పోలింగ్ కేంద్రంలో జరిగే ప్రతి కదలిక ఏజెంట్ నిశితంగా పరిశీలించాలి. ఏమాత్రం అనుమానం వచ్చినా ఏజెంట్ తన అభ్యంతరాన్ని ప్రీసైడింగ్ అధికారికి తెలపవచ్చు. ఏజెంట్లుగా అభ్యర్థులు తమకు నమ్మకమైన వారిని కూర్చోబెడతారు. ఏజెంట్ ఏ మాత్రం తప్పు చేసినా ఆ పార్టీ అభ్యర్థికి నష్టం కలుగుతుంది.

ఉత్కంఠ నగరం!

అభ్యర్థుల ఎంపికలోనూ... విజయావకాశాల్లోనూ... ప్రతిసారీ ఉత్కంఠకు గురిచేసే నియోజకవర్గం ఏదంటే... ఠక్కున గుర్తుకు వచ్చే పేరు గజపతినగరం. వివిధ సమీకరణాల నేపథ్యంలో అన్ని పార్టీలూ ఇక్కడి అభ్యర్థి విషయంలో చివరి వరకూ వేచి చూడడం పరిపాటి. గెలుపు విషయంలోనూ అంతే... ఫలితాలు వెలువడే వరకూ విజయం ఎవరిని వరిస్తుందనే విషయంలోనూ అటు అభ్యర్థులు.. ఇటు ఓటర్లు టెన్షన్‌తో ఎదురు చూడాల్సిందే.

- టీడీపీకి ఐదుసార్లు అవకాశం
- ప్రతిసారీ పోటాపోటీ
- ఇదీ గజపతినగరం ప్రత్యేకత

(గజపతినగరం)

తెలుగుదేశం పార్టీకి కంచుకోటగా నిలిచిన గజపతినగరం అంటే సంచలనాలకు మారు పేరు. నియోజకవర్గం ఏర్పాటైనప్పటి నుంచి అన్ని వర్గాల వారిని ఇక్కడి ప్రజలు ఆదరించారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా చివరి వరకు అభ్యర్థుల పేర్లు ఖరారు కాకపోవడం ఇక్కడి విశేషం. నువ్వా? నేనా? అన్నట్లుగా పోటీ ఉండడంతో అటు నాయకులు... ఇటు ఓటర్లలో తీవ్ర ఉత్కంఠ నెలకొంటుంది. తెలుగుదేశం ఆవిర్భావం నుంచి 5 పర్యాయాలు ఆ పార్టీ అభ్యర్థులకు నియోజకవర్గ ప్రజలు పట్టం కట్టారు. గజపతినగరం నియోజకవర్గంలో కాపు, వెలమ సామాజిక వర్గాల వారే అధికం. మొట్టమొదటిగా బొండపల్లి మండలానికి చెందిన జంపన సత్యనారాయణరాజు టీడీపీ ఎమ్మెల్యేగా గెలుపొందగా... ఆ తరువాత రాజకీయాల్లోకి వచ్చిన పడాల అరుణ మూడుసార్లు విజయం సాధించారు. కె.ఎ.నాయుడు ఒకసారి ఎమ్మెల్యేగా గెలిచారు. 1955లో గజపతినగరం నియోజకవర్గం ఆవిర్భవించింది. మొదటి అసెంబ్లీ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రజా సోషలిస్టు పార్టీ నుంచి కుసుమ గజపతిరాజు పోటీ చేసి గెలుపొందారు. ఆ తరువాత 1959లో జరిగిన ఉప ఎన్నికల్లో స్వతంత్ర పార్టీ అభ్యర్థిగా తాడ్డి సన్యాసినాయుడు పోటీ చేసి గెలుపొందారు. ఆ తరువాత జరిగిన ఎన్నికల్లో 1962, 67లో కూడా తాడ్డి సన్యాసినాయుడు రెండు పర్యాయాలు పోటీ చేసి విజయం సాధించారు. 1972లో భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ తరఫున పెనుమత్స సాంబశివరాజు పోటీ చేసి గెలుపొందారు. 1978లో జనతా పార్టీ అభ్యర్థిగా... 1985లో కాంగ్రెస్ అభ్యర్థిగా వంగపండు నారాయణ ప్పలనాయుడు రెండు పర్యాయాలు విజయం సాధించారు. 1983లో తెలుగుదేశం పార్టీ తరఫున జంపాన సత్యనారాయణరాజు పోటీ చేసి గెలుపొందగా... 1989, 1994, 2004లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి పడాల అరుణ మూడు పర్యాయాలు పోటీ చేసి విజయం సాధించారు. 1999లో భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా తాడ్డి సన్యాసి అప్పలనాయుడు అసెంబ్లీలో అడుగు పెట్టారు. 2009లో కాంగ్రెస్ తరఫున.. 2019లో వైసీపీ తరఫున బొత్స అప్పలనరసయ్య పోటీ చేసి విజయం సాధించారు. 2014లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి కొండపల్లి అప్పలనాయుడు విజయం సాధించారు. తాజా ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా కొండపల్లి శ్రీనివాస్, వైసీపీ అభ్యర్థిగా బొత్స అప్పలనరసయ్య, కాంగ్రెస్ నుంచి డోల శ్రీనివాస్ పోటీలో ఉన్నారు. ఈ పర్యాయం నియోజకవర్గ ప్రజలు ఎవరికి పట్టం కట్టనున్నారో వేచి చూడాలి.

మండలాల వారీగా..

మండలం	పురుష ఓటర్లు	మహిళా ఓటర్లు	పోలింగ్ కేంద్రాలు
గజపతినగరం	22550	23297	62
దత్తిరాజేరు	22313	22843	57
బొండపల్లి	19773	20567	52
గంట్యాడ	25547	26866	63
జామి	10044	10481	30


గజపతినగరం నియోజకవర్గ ముఖచిత్రం

ఓటర్లు ఇలా..

మొత్తం ఓటర్లు:	2,04,286
పురుషులు:	1,00,227
మహిళలు:	1,04,054
ఇతరులు:	05

నియోజకవర్గం పరిధిలోని మండలాలు..

గజపతినగరం నియోజకవర్గ పరిధిలో గజపతినగరం, దత్తిరాజేరు, బొండపల్లి, గంట్యాడ మండలాలతో పాటు జామి మండలంలోని 15 గ్రామ పంచాయితీలు ఉన్నాయి.



గజపతినగరం నియోజకవర్గం మ్యాప్



గజపతినగరం పట్టణం



పెనుమత్స సాంబశివరాజు



వంగపండు నారాయణప్పనాయుడు



తాడ్డి సన్యాసినాయుడు



పడాల అరుణ



బొత్స అప్పలనరసయ్య



కేవీ నాయుడు



తాడ్డి సన్యాసి అప్పలనాయుడు

గజపతినగరం నియోజకవర్గం ఎమ్మెల్యేలు

సం.	పేరు	పార్టీ
1955	కుసుమ గజపతిరాజు	ప్రజా సోషలిస్టు పార్టీ
1959	తాడ్డి సన్యాసినాయుడు	స్వతంత్ర పార్టీ
1962	తాడ్డి సన్యాసినాయుడు	స్వతంత్ర పార్టీ
1967	తాడ్డి సన్యాసినాయుడు	స్వతంత్ర పార్టీ
1972	పెనుమత్స సాంబశివరాజు	కాంగ్రెస్
1978	వంగపండు నారాయణప్పలనాయుడు	జనతా
1983	జంపన సత్యనారాయణరాజు	తెలుగుదేశం
1985	వంగపండు నారాయణప్పలనాయుడు	కాంగ్రెస్
1989	పడాల అరుణ	తెలుగుదేశం
1994	పడాల అరుణ	తెలుగుదేశం
1999	తాడ్డి సన్యాసి అప్పలనాయుడు	కాంగ్రెస్
2004	పడాల అరుణ	తెలుగుదేశం
2009	బొత్స అప్పలనరసయ్య	కాంగ్రెస్
2014	కొండపల్లి అప్పలనాయుడు	తెలుగుదేశం
2019	బొత్స అప్పలనరసయ్య	వైసీపీ

అక్కడ గెలిస్తే... మంత్రి పదవి ఖాయం!

- ఇదీ చీపురుపల్లి ప్రత్యేకత

(చీపురుపల్లి)

సెంటిమెంట్

చీపురుపల్లి నుంచి అసెంబ్లీకి ఎన్నికైన నాయకులను పలుమార్లు ముఖ్య పదవులు వరించాయి. ఇక్కడి నుంచి గెలిచి అసెంబ్లీలో అడుగు పెట్టిన ఐదుగురు నాయకులు కేబినెట్‌లో స్థానం సంపాదించి... రాష్ట్ర రాజకీయాల్లో చక్రం తిప్పారు. కేబినెట్‌లో అవకాశం కోల్పోయిన మరో నాయకుడు ప్రభుత్వ విప్ పదవిని చేపట్టి... రాజకీయాల పరంగా చీపురుపల్లికి ఉన్న సంప్రదాయాన్ని కొనసాగించారు. 1978 నుంచి ఇప్పటి వరకూ కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీల తరఫున గెలిచిన ఐదుగురు నాయకులకు ఉన్నత పదవులు దక్కాయి. తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించక ముందు 1978లో చీపురుపల్లి ఎమ్మెల్యేగా గెలిచిన చిగిలపల్లి శ్యామలరావు తొలిసారిగా మంత్రి పదవి చేపట్టారు. అప్పట్లో మర్రి చెన్నారెడ్డి ముఖ్యమంత్రి. ఆయన కేబినెట్‌లో శ్యామలరావు సమాచార శాఖ మంత్రిగా పని చేశారు. రాజకీయంగా ప్రాధాన్యం ఉన్న చీపురుపల్లికి మంత్రి పదవులు రావడం ఆయనతోనే ప్రారంభమైంది. ఆ తరువాత తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించాక... 1983లో ఎన్టీ రామారావు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. అప్పట్లో చీపురుపల్లి నుంచి గెలిచిన త్రిపురాన వెంకటరత్నంను ఆయన మంత్రి వర్గంలోకి తీసుకున్నారు. ఆమె స్త్రీ, శిశు సంక్షేమ మంత్రిగా పనిచేశారు. ఆ తరువాత 1994, 99లో తెలుగుదేశం పార్టీ తరఫున గెలిచిన గద్దే బాబూరావుకు మంత్రి వర్గంలో చోటు దక్కక పోయినప్పటికీ ప్రభుత్వ విప్ పదవి లభించింది. 2004లో జరిగిన ఎన్నికల్లో గెలిచిన బొత్స సత్యనారాయణ.... వైఎస్ హయాంలో భారీ పరిశ్రమల శాఖ మంత్రిగా పదవిని చేపట్టారు. 2009లో రెండోసారి గెలిచిన ఆయన పంచాయతీ రాజ్ మంత్రిగా మరోమారు కేబినెట్‌లో స్థానం సంపాదించుకున్నారు. ఆ తరువాత 2014లో చీపురుపల్లిలో దేశం జెండాను తిరిగి రెపరెపలాడించిన కిమిడి మృణాళినికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మంత్రివర్గంలో పంచాయతీ రాజ్, గృహ నిర్మాణ శాఖలను అప్పగించారు. ఈ రకంగా చీపురుపల్లి నుంచి గెలిచిన నాయకులకు రాష్ట్ర రాజకీయాల్లోనూ... ముఖ్యంగా మంత్రివర్గాల్లో స్థానం దక్కుతోంది. ప్రభుత్వం ఏదైనా ఇలా మంత్రి వర్గ కూర్పులో చీపురుపల్లికి ప్రాధాన్యం ఇస్తుండడంతో... ఏ పార్టీకి చెందిన వారైనా ఇక్కడి నుంచి పోటీకి ఉత్సాహం చూపిస్తారనే మాట ఉంది.



త్రిపురాన వెంకటరత్నం



కిమిడి మృణాళిని



గద్దే బాబూరావు



బొత్స సత్యనారాయణ

ప్రచారంలో గీత దాటితే..

(కొమరాడ)



నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. ప్రచారాలు హోరెత్తుతున్నాయి. ఈ సందట్లో పార్టీలూ, కార్యకర్తలూ నిబంధనలు మరిచిపోయి అత్యుత్సాహంతో ప్రవర్తిస్తుంటారు. ఎన్నికల సంఘం ప్రచారా లకు స్పష్టమైన గీత గీసింది. ఆ నిబంధనలు ఇవీ..

- ప్రచార వాహనాలకు రిటర్నింగ్ అధికారి అనుమతి తీసుకోవాలి. అనుమతి పత్రాన్ని వాహనానికి అతికించాలి. వాహనాన్ని అనుమతి పొందిన అభ్యర్థే వాడాలి. ఇతరులు వాడితే చర్యలు తీసుకుంటారు.
- విద్యా సంస్థల్లో, వాటి మైదానాల్లో ఎన్నికల ప్రచారం చేయకూడదు.
- కరపత్రాలపై ముద్రణాలయాల పేరు, చిరునామా కచ్చితంగా ఉండాలి.
- ప్రచారంలో టీపీలు, కండువాలు ఇవ్వవచ్చు. వీటిని ఎన్నికల ఖర్చులో చూపించాలి. ధరించే దుస్తులు మాత్రం ఇవ్వకూడదు.
- దేవుళ్ల ఫొటోలు, అభ్యర్థి ఫొటోతో కలిపి డైరీలు, క్యాలెండర్లు ప్రచురించకూడదు. వాహనాలపై కూడా మతపరమైన ఫొటోలు, అభ్యర్థి ఫొటోలు ఉండకూడదు.
- ప్రార్థనా స్థలాలకు, పాఠశాలలకు, పోలింగ్ స్టేషన్‌కు 200 మీటర్ల లోపు రాజకీయ పార్టీల తాత్కాలిక కార్యాలయాలు ఉండకూడదు.
- రాత్రి 10 గంటల తరువాత, ఉదయం 6 గంటలలోపు మైకులు, లౌడ్ స్పీకర్లు వాడకూడదు.
- ఏజెంట్ సంబంధిత పోలింగ్ బూత్ పరిధిలో ఓటరై ఉండాలి.
- ఊరేగింపు రూటును ముందుగానే పోలీసులకు తెలియజేయాలి.
- దిష్టి బొమ్మలు తగులబెట్టకూడదు.

అప్పట్లో 21 ఏళ్లకు ఓటు హక్కు

(కొమరాడ)



కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల నిర్వహణలో ఏడు దశాబ్దాల కాలంలో అనేక సంస్కరణలు తీసుకొచ్చింది. భారతదేశంలో మొదట సాధారణ ఎన్నికలు 1952లో ఎన్నికల కమిషనర్ సుకుమార్‌జైన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. తొలి ఎన్నికల్లో 17.90 కోట్ల మందికి ఓటు వేసే అవకాశం కల్పించారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి 1985 వరకు ఓటు హక్కు కనీస వయస్సు 21 సంవత్సరాలుగా ఉండేది. రాజీవ్‌గాంధీ ప్రధానమంత్రి అయ్యాక 1988లో 61వ రాజ్యాంగ సవరణ ద్వారా ఓటు హక్కు వయస్సును 18 ఏళ్లకు తగ్గించారు. ఎన్నికల నిర్వహణలో సమూల సంస్కరణలు అమలు చేసిన ఘనత 1990లో ఎన్నికల కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన టీఎన్ శేషన్‌కు దక్కుతుంది. 1952లో జరిగిన భారతదేశ మొదటి సాధారణ ఎన్నికల్లో దేశ వ్యాప్తంగా 55 పార్టీలు బరిలో నిలవగా.. 2014 నాటికి ఆ సంఖ్య 370కు చేరింది. బ్యాలెట్ పేపర్‌తో ఎన్నికలు నిర్వహించే విధానం నుంచి ప్రస్తుతం ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ (ఈవీఎం) వినియోగించే విధానాన్ని అమలు చేస్తున్నారు. 2019లో జరిగిన ఎన్నికల నుంచి ఓటు ఎవరికి వేశారో తెలుసుకునేందుకు ఓటరు వెరిఫైడ్ పేపర్ ఆడిట్ ట్రయల్ (వీవీ ప్యాట్) యంత్రాలను కూడా వినియోగిస్తున్నారు.

స్థానికేతరులకే పట్టం

రాజాం రూరల్: 'మహారాష్ట్రలోని నాసికాత్రయంబకంలో పుట్టి ఆంధ్రదేశాన్ని గోదావరి నది సస్యశ్యామలం చేస్తోంది. ఈ వాస్తవం కాంగ్రెస్ నాయకులకు కనిపించడం లేదా?' అని 1967లో ఓ ఎన్నికల సభలో 'స్థానికేతర' అంశంపై ఆవేశంగా ప్రశ్నించారు దివంగత సర్దార్ గౌతు లచ్చన్న. అదే ఏడాది శ్రీకాకుళం లోక్‌సభకు జరిగిన ఉప ఎన్నికలలో లచ్చన్న తన రాజకీయ గురువైన ఆచార్య ఎన్‌జీ రంగాను స్వతంత్ర పార్టీ తరఫున పోటీలో నిలిపారు. ఈ సందర్భంగా ప్రత్యర్థులు స్థానికేతర అంశాన్ని తెరపైకి తెచ్చారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీలో ఉన్న బొడ్డేపల్లి రాజగోపాలరావుతో పాటు ఇతర నాయకులంతా స్థానికేతరుడైన రంగా ఇక్కడ పోటీ చేయడమేమిటని ప్రచారంలో దుమ్మెత్తి పోశారు. చిత్తూరులో చిత్తుగా ఓడిపోయిన నాయకుడిని ఈ ఉపఎన్నికలలో చిత్తుచిత్తుగా ఓడించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచార సభల్లో రంగా ప్రసంగాలు ప్రజలలో ఆలోచనలను రేకెత్తించాయి. స్థానికేతరుడని భావించకుండా రంగాకు పట్టం కట్టి ఢిల్లీకి పంపించారు జిల్లా ప్రజలు.

స్థానికేతర నినాదం ప్రతి ఎన్నికలలో ఏదో ఒక నియోజకవర్గంలో తెరపైకి వస్తూనే ఉంది. ఇలాంటి స్థానికేతర నినాదాన్ని ప్రజలు పట్టించుకోరని చరిత్ర చెబుతోంది. ప్రాంతంపై అవగాహన... ప్రజలతో సత్సంబంధాలు ఏర్పరచుకునే వ్యక్తికే ఓటర్లు పట్టం కడుతున్నారు.



రాజాం పట్టణం

ఉణుకూరు నుంచి రాజాం వరకూ..

పూర్వపు ఉణుకూరు నియోజకవర్గం నుంచి నేటి రాజాం వరకూ ఈ ప్రాంతీయులు స్థానికేతరులకే పట్టం కడుతున్నారు. ఫలితంగా ఆ వ్యక్తులు చట్టసభలకు వెళుతున్నారు. 1962లో ఉణుకూరు నియోజకవర్గం నుంచి పాలవలస సంగం నాయుడు, 1972లో పాలవలస రుక్మిణమ్మ, 1994లో పాలవలస రాజశేఖరం ఎమ్మెల్యేలుగా గెలిచారు. వీరిది పాలకొండ మండలం నీలానగరం. రాజాం, వంగర, రేగిడి, బలిజిపేట మండలాల ప్రజలు వారిని ఆదరించారు. నియోజకవర్గాల పునర్విభజనలో ఎచ్చెర్ల నియోజకవర్గం నుంచి వచ్చిన కోండ్రు మురళీమోహన్‌కు ఈ ప్రాంతీయులు బ్రహ్మరథం పట్టారు. 2009లో ఆయన రాజాం నుంచి గెలుపొంది వైద్య, ఆరోగ్యశాఖ మంత్రిగా పనిచేశారు. 2014, 19 ఎన్నికలలో రాజాం నుంచి గెలుపొందిన ఎమ్మెల్యే కంబాల జోగులుది పాలకొండ మండలం మంగళాపురం. ప్రస్తుతం పోటీలో ఉన్న వైసీపీ అభ్యర్థిది పాలకొండ మండలం ఎస్.కె.రాజపురం.

పాలకొండలో అగ్నిప్రమాదం

● మూడు షాపులు దగ్ధం



అగ్నికి ఆహుతవుతున్న షాపులు

పాలకొండ: పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద శుక్రవారం అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో అరుణాచల ట్రావెల్స్ యజమాని కడగల పురుషోత్తం, పరిశెర్ల సీతంనాయుడు, ఎచ్చెర్ల లక్ష్మిలకు చెందిన ట్రాన్స్‌పోర్టు అండ్ ట్రావెల్‌కు సంబంధించిన పూరిపాకల షాపులు మూడు అగ్నికి ఆహుతయ్యాయి. షాపులకు ఆనుకుని ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌పై పక్షి వాలడం వల్ల నిప్పు రవ్వలు ఈ షాపులపై పడి అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. షాపులో ఉన్న ఆయిల్స్, ఫర్నీచర్, టైర్లు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు అగ్నిమాపక అధికారి జామి సర్వేశ్వరరావు, సిబ్బంది శకటంతో వచ్చి మంటలను అదుపు చేశారు. కాగా, రూ.2.50 లక్షలు ఆస్తినష్టం జరిగినట్టు అంచనా వేసినట్టు తెలిసింది.

బైకు బోల్తా.. ఇద్దరికి గాయాలు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని ఎల్విన్‌పేట-కేదారిపురం ప్రధాన రహదారిలో పీటీజీ గురుకుల బాలికల పాఠశాల దిగువన బైకు అదుపు తప్పి బోల్తా పడిన ఘటనలో ఇద్దరు యువకులను తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. గుమ్మలక్ష్మీపురం గ్రామం కొండ వీధికి చెందిన బి.వెంకటరావు, తన సోదరుడు సురేష్‌తో పని నిమిత్తం బైకుపై జేకేపాడు గ్రామానికి వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. వెంకటరావుకు కాలు విరగ్గా, సురేష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను గుమ్మలక్ష్మీపురం సీహెచ్‌సీకి తీసుకుని వెళ్లి, చికిత్స అందిస్తున్నారు.

వ్యాను, ఆటో ఢీ

మక్కువ: మినీ వ్యాను, ఆటో ఢీకొని ఒకరు గాయపడిన ఘటన మండలంలోని కవిరిపల్లి గ్రామ సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు అందించిన వివరాలు ప్రకారం.. మక్కువ నుంచి శంబర వెళ్తున్న మినీ వ్యాను కవిరిపల్లి నుంచి మక్కువ వస్తున్న ఆటో ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో కవిరిపల్లి గ్రామానికి చెందిన గదిలి విశ్వనాథంకు గాయాలయ్యాయి. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ పి.నరసింహమూర్తి తెలిపారు.

అఫిడవిట్‌లో ఆస్తుల వివరాలు చూపించలేదు

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: పార్వతీపురం వైసీపీ అభ్యర్థి అలజంగి జోగారావు తన అఫిడవిట్‌లో పూర్తిగా తనకున్న ఆస్తుల వివరాలను చూపించలేదని కూటమి అభ్యర్థి బోనెల విజయచంద్ర ఆరోపించారు. శుక్రవారం మధ్యాహ్నం ఆయన పార్వతీపురంలో విలేకర్లతో మాట్లాడారు. నామినేషన్ పత్రాల పరిశీలనలో అఫిడవిట్‌లో పొందుపరచని జోగారావు ఆస్తులు వివరాలను ఆధారాలతో సహా పార్వతీపురం ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి హేమలతకు అందించామని, దీనిపై పరిశీలిస్తామని ఆమె చెప్పినట్టు విజయచంద్ర తెలిపారు. నియోజకవర్గంలో మూడు చోట్ల జోగారావుకు ఓట్లు ఉన్నట్టు ఆర్వో ఫిర్యాదు చేసినట్టు చెప్పారు. దీనిపై రాష్ట్ర తెలుగుదేశం లీగల్ బృందానికి కూడా తెలియజేశానని ఆయన తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బార్నాల సీతారాం, గొట్టాపు వెంకటనాయుడు, వేణు, కోలా మధుసూదనరావు పాల్గొన్నారు.

ఐదు రోజులు మంటలే

● వచ్చే నెలలో మరింత వేడిగాలులు..

● 45 డిగ్రీలు దాటి నమోదయ్యే అవకాశం

విశాఖపట్నం, అమరావతి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది వేసవి తీవ్రంగా ఉంటుందని వాతావరణ నిపుణులు, భారత వాతావరణ శాఖ (ఐఎండీ) అధికారులు ముందే హెచ్చరించారు. కానీ, అంతకు మించి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. గతేడాదికంటే ప్రస్తుత ఏడాది రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదు కావొచ్చని ఐఎండీ సీనియర్ అధికారి డీఎస్ పాయ్ శుక్రవారం పేర్కొన్నారు. ఇప్పటివరకు 2023 అత్యంత వేడి సంవత్సరంగా నమోదైందని, అయితే ఈ ఏడాది ఆ రికార్డును అధిగమిస్తుందని అంచనా వేశారు. రానున్న ఐదు రోజుల్లో దక్షిణాదిలో ఏపీ, తమిళనాడు, తెలంగాణ, కర్ణాటక, వీటికి ఆనుకుని ఒడిశా, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, విదర్భ, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్‌లోని అనేక ప్రాంతాల్లో వేడి వాతావరణం కొనసాగడమే కాకుండా వడగాడ్పులు వీస్తాయని ఐఎండీ శుక్రవారం హెచ్చరించింది. ఈ నెల 28 నుంచి 30 వరకు ఈశాన్య భారతంలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. రానున్న రెండు రోజుల్లో ఉష్ణోగ్రత 46 డిగ్రీలకు చేరనుంది. శనివారం.. శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, అల్లూరి, అనకాపల్లి, కాకినాడ, తూర్పుగోదావరి, ఏలూరు జిల్లాల్లోని 64 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు వీస్తాయని, రాష్ట్రవ్యాప్తంగా 183 మండలాల్లో మోస్తరు వడగాడ్పులు వీస్తాయని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. ఉష్ణోగ్రతలు, వడగాడ్పులు పెరిగిన నేపథ్యంలో గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు, వృద్ధులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ కూర్మనాథ్ సూచించారు.

తొలగించినా విధుల్లోనే..!

గరుగుబిల్లి: మండలంలోని ఉపాధి హామీ పథకంలో విధులు నిర్వహించిన ఓ ఉద్యోగిని విధుల్లో నుంచి తొలగించినా యథావిధిగా విధుల్లో జోక్యం చేసుకుంటున్నాడు. ఈయన గతంలో విధులు నిర్వహిస్తున్న సమయంలో టీడీపీ నేత నారా లోకేష్‌పై అభ్యంతకర పోస్టింగ్‌లు పెట్టాడు. ఈ ఘటనపై సి-విజిల్‌కు ఫిర్యాదు అందిన నేపథ్యంలో సంబంధిత అధికారులు అందించిన నివేదిక ప్రకారం ఈనెల 20న ఆయనను పూర్తిగా విధుల నుంచి తొలగిస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. అయితే నేటికీ సంబంధిత వ్యక్తి తొలగింపు నోటీసును తీసుకోకుండా, విధుల్లో జోక్యం చేసుకుంటున్నాడు. దీనిపై ఏపీవో గౌరీనాథ్‌ను అడగ్గా, సంబంధిత వ్యక్తి కనిపించడం లేదని చెప్పడం గమనార్హం.

నోటీసు తీసుకోలేదు

ఈ విషయంపై శుక్రవారం ఎంపీడీవో పి.సూర్యనారాయణ, ఏపీవో గౌరీనాథ్‌లను వివరణ కోరగా, కలెక్టర్ తొలగింపు నోటీసు జారీ చేసినా నేటికీ ఆయన తీసుకోలేదని చెప్పారు. విధుల్లో జోక్యం చేసుకోవద్దని హెచ్చరించినా జోక్యం మానలేదన్నారు. సంబంధిత గ్రూపు నుంచి తక్షణమే తొలగిస్తామని తెలిపారు. తొలగింపు నోటీసు తీసుకోని పక్షంలో పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

సకాలంలో వేతనాలు చెల్లించాలి



కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

పాలకొండ: మున్సిపల్ కార్మికుల వేతనాలను సకాలంలో అందించాలని సీఐటీయూ నాయకుడు దావాల రమణారావు, మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకులు సీహెచ్ సురేష్, సంజీవి, పడాల వేణు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం నగర పంచాయతీ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. అనంతరం కమిషనర్ సర్వేశ్వరరావుకు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల పట్ల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. జనవరి 2024 ఖర్చులకు వెయ్యి రూపాయలు ఇస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటిస్తే ఇంతవరకు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేశారన్నారు. ఈ ఏడాది మార్చి నెలకు రూ.21వేలు వేతనం చెల్లించకుండా పాత వేతనమే చెల్లించడం తగదన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఎన్నిమార్లు విన్నవించినా ఫలితం లేదన్నారు.

సమయ పాలన పాటించాలి



వేతనదారులకు అవగాహన కల్పిస్తున్న ఏపీవో

గరుగుబిల్లి: ఉపాధి వేతనదారులు సమయ పాలన పాటిస్తేనే వేతనం గిట్టుబాటు అవుతుందని ఉపాధి హామీ మండల ఏపీవో ఎం.గౌరీనాథ్ అన్నారు. కొంకడివరం గ్రామంలో నిర్వహిస్తున్న ఉపాధి పనులను ఆయన శుక్రవారం పరిశీలించి, మస్తర్లను తనిఖీ చేశారు. ప్రస్తుత వేసవిలో ఉదయం 6 గంటల నుంచి 10లోపు పనులకు హాజరు కావాలన్నారు. నిర్దేశించిన కొలతలు మేరకు పనులు నిర్వహిస్తే రూ.300 వేతనం అందే అవకాశం ఉందని చెప్పారు. ఉపాధి నిబంధనలు ధిక్కరిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని ఆయన సిబ్బందికి హెచ్చరించారు. ఆయన వెంట పలువురు ఉపాధి సిబ్బంది ఉన్నారు.

కూలేందుకు సిద్ధంగా..

● శిథిలావస్థలో తురకనాయుడువలస వంతెన ● ప్రమాదకర స్థితిలో రాకపోకలు

● బ్రిటీష్‌కాలం నాటి ఈ నిర్మాణాన్ని పట్టించుకోని అధికారులు



రక్షణ గోడలు లేకపోవడంతోపాటు శిథిలావస్థకు చేరిన తురకనాయుడువలస వంతెన



వంతెన కింది భాగంలో గజాలు బయటకు కనబడుతున్న దృశ్యం

జియ్యమ్మవలస: ప్రమాదం అని తెలిసినా అధికారులు, ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడం లేదు. శిథిలావస్థకు చేరుకున్న వంతెన స్థానంలో కొత్త వంతెన నిర్మాణం చేపట్టడం లేదు. ఎన్నిసార్లు అధికారులకు వేడుకున్నా దున్నపోతు మీద వాన పడినట్లుంది. వారిలో కనీస చలనం లేదు. అందుకే ఎప్పుడు ఏ ప్రమాదం జరిగినా ప్రభుత్వం, ప్రభుత్వ అధికారులదే బాధ్యత అంటున్నారు స్థానికులు. గరుగుబిల్లి మండలం నాగూరు గ్రామం నుంచి జియ్యమ్మవలస మండలం తురకనాయుడువలస గ్రామాల మధ్య తురకనాయుడువలస పక్కనే ఉన్న వంతెన దుస్థితి ఇదీ.

ఈ వంతెన 1902లో బ్రిటీష్‌వారు నిర్మించారు. ఈ వంతెనతో పాటు నిర్మించిన కట్టడాలన్నీ దాదాపు కూలిపోవడమో, తొలగించడమో జరిగింది. కానీ ఈ వంతెన అలాగే ఉంది. ప్రస్తుతం ఈ వంతెనకు రక్షణ గోడ కూడా లేదు. ఏ మాత్రం ఏమరపాటు అయినా భారీ మూల్యం చెల్లించక తప్పని పరిస్థితి. ఈ బ్రిడ్జిపై నుంచే పెదబుడ్డిడి, ఇటిక-నాగూరు బస్సులు వెళ్తూ ఉంటాయి. వీటితో పాటు ఆటోలు, వ్యాన్లు, లారీలు, ద్విచక్ర వాహనాలు ఈ బ్రిడ్జి పైనుంచే వెళ్తుంటాయి. మండల కేంద్రం నుంచి 25 గ్రామాల ప్రజలు జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే ఇదే షార్ట్ కట్ రహదారి. అటువంటి ఈ రహదారిపై ఉన్న వంతెన శిథిలావస్థకు చేరుకున్నా పట్టించుకునే నాథుడే లేకపోవడం దురదృష్టకరం. ఇంకో విషయం ఏమిటంటే ఈ వంతెన తోటపల్లి ఎడమ కాలువలో నెంబరు వన్ డిస్ట్రిబ్యూటరీపై ఉంది. ఇకనైనా ప్రభుత్వం, కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని నూతన వంతెన నిర్మాణానికి నీటి పారుదలశాఖ అధికారులకు తగు ఆదేశాలు చేసి,నిధులు మంజూరు చేయించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఏ క్షణం ఏ ప్రమాదం జరుగుతుందో..

ఈ వంతెన చాలా శిథిలావస్థలో ఉంది. దీనిపై నుంచి వాహనాలు వెళ్తుంటే ఏ క్షణం ఏ ప్రమాదం జరుగుతుందోనని భయపడుతుంటాం. అంత ప్రమాదంగా ఉంది.

- మరడాన శ్రావణి, తురకనాయుడువలస

ఐదేళ్లలో అభివృద్ధి జాడే లేదు: జయకృష్ణ



ఎన్నికల ప్రచారం చేస్తున్న జయకృష్ణ

సీతంపేట: గత ఐదేళ్లుగా నియోజకవర్గంలో అభివృద్ధి అనే పదం లేదని, దోచుకోవడం, దాచుకోవడం తప్ప సాధించింది ఏమీ లేదని కూటమి పాలకొండ ఎమ్మెల్యే అభ్యర్థి నిమ్మక జయకృష్ణ అన్నారు. మండలంలోని దేవనాపురం, వేంపలగూడ, రేగులగూడ, పాత ఈతమానుగూడ, కొత్తగూడ, ఇప్పగూడ, ముకుందాపురం, కల్లంగూడ, ఆనపకాయలగూడ, పులిపుట్టి గ్రామాల్లో ఆయన శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో గ్లాసు గుర్తుపై ఓటు వేసి, గెలిపించాలని కోరారు. కూటమి నాయకులు సవరతోట ముఖలింగం తదితరులు పాల్గొన్నారు.

జనసేనలో చేరిక

వీరఘట్టం: చిట్టిపుడివలస సర్పంచ్ కుంబిడి పాపమ్మ, ఎంపీటీసీ విశాలాక్షి, పది మంది వార్డు మెంబర్లతో పాటు పలు కుటుంబాలు శుక్రవారం జనసేన పార్టీలో చేరాయి. వీరికి కూటమి అభ్యర్థి నిమ్మక జయకృష్ణ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ చేరికల్లో ఉదయాన ఉదయ్‌భాస్కర్, పొదిలాపు కృష్ణమూర్తినాయుడు, బల్లా హరిబాబు, అనీల్‌బాబు తదితరులు ఉన్నారు.

ప్రచారంలో పృథ్వీరాజ్



పాలకొండ: ప్రచారం నిర్వహిస్తున్న పృథ్వీరాజ్

పాలకొండ: పాలకొండ ఎమ్మెల్యే అభ్యర్థి నిమ్మక జయకృష్ణను అఖండ మెజార్టీతో గెలిపించాలని సినీనటుడు పృథ్వీరాజ్ ఓటర్లను అభ్యర్థించారు. పట్టణంలో శుక్రవారం ఆయన ప్రచారం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో అసెంబ్లీ అభ్యర్థి జయకృష్ణకు గ్లాసు గుర్తుపై, అరకు ఎంపీ అభ్యర్థి కొత్తపల్లి గీతకు కమలం గుర్తుకు ఓటు వేయాలని కోరారు. తొలుత విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. ఈ ప్రచారంలో కూటమి నాయకులు గంటా సంతోష్‌కుమార్, గర్భాన సత్తిబాబు, తమ్మారావు, తదితరులు పాల్గొన్నారు. ● **వీరఘట్టం:** కూటమి అభ్యర్థి జయకృష్ణకు మద్దతుగా సినీనటుడు పృథ్వీ రాజ్ శుక్రవారం వీరఘట్టంలో ప్రచారంచేశారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

పార్వతీపురంటౌన్: కొంతమంది బీజేపీలో ఉంటూ పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతుండడం విచారకరమని, అలాంటి వారిపై కఠిన చర్యలు తప్పవని పార్టీ జిల్లా అధ్యక్షుడు డి.శ్రీనివాసరావు హెచ్చరించారు. బైపాస్ రోడ్డులోగల బీజేపీ కార్యాలయంలో ఆయన శుక్రవారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఇప్పటికే పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలను సస్పెండ్ చేశామని చెప్పారు. ఎన్డీయే కూటమిలో ఉంటూ ఇండిపెండెంట్లుగా నామినేషన్ వేసిన వారిపై, సోషల్ మీడియాలో పార్టీ వ్యతిరేకంగా ప్రచారం చేసిన వారిపై త్వరలో చర్యలు తీసుకుంటామని చెప్పారు. సోషల్ మీడియాలో జిల్లా పార్టీపైనా, జిల్లా అధ్యక్షుడిపైనా అనుచిత వాఖ్యలు చేసిన వారిపై సస్పెన్షన్ వేటు వేస్తామని చెప్పారు. బీజేపీలో ప్రతిఒక్కరూ క్రమశిక్షణ కలిగి ఉండాలని, పార్టీ ఆదేశాలకు అనుగుణంగా పనిచేయాలన్నారు.

పథకాలు కేంద్రానివి.. ప్రచారం రాష్ట్రానిది



ప్రచార ర్యాలీలో కురుపాం ఎమ్మెల్యే అభ్యర్థి జగదీశ్వరి, అరకు ఎంపీ అభ్యర్థి గీత

కొమరాడ: కేంద్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలను తీసుకువస్తే వాటిని తామే అమలు చేస్తున్నామన్న విధంగా రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం ప్రచారాన్ని చేస్తోందని కూటమి అరకు పార్లమెంటు నియోజకవర్గ ఎంపీ అభ్యర్థి కొత్తపల్లి గీత అన్నారు. శుక్రవారం రాత్రి కొమరాడలో జరిగిన ర్యాలీలో ఆమె మాట్లాడారు. రాష్ట్రం, దేశం సుభిక్షంగా ఉండాలంటే కూటమి అభ్యర్థులకే ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి కురుపాం ఎమ్మెల్యే అభ్యర్థి తోయక జగదీశ్వరితో పాటు పలువురు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిక



టీడీపీలో చేరిన వారితో బోనెల విజయచంద్ర

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: జిల్లా కేంద్రం పార్వతీపురంలోని ఆరో వార్డుకు చెందిన సుమారు వంద కుటుంబాలు వైసీపీని శుక్రవారం టీడీపీలో చేరాయి. వీరందరికీ కూటమి అభ్యర్థి బోనెల విజయచంద్ర కండువాలు వేసి, పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు శివ తదితరులు ఉన్నారు.

వైసీపీని ఓడించేందుకు ప్రజలు సిద్ధం

● కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సంధ్యారాణి



పార్టీలోకి చేరినవారిని ఆహ్వానిస్తున్న సంధ్యారాణి

పాచిపెంట: వైసీపీని ఓడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. శుక్రవారం గురువునాయుడుపేటలో ఆమె ప్రచారం చేశారు. గ్రామంలోని మహిళలు ఆమెకు పూలదండలు వేసి, హారతులతో స్వాగతం పలికారు. మోసూరు గ్రామంలో వైసీపీ నుంచి 50 కుటుంబాలు టీడీపీలో చేరాయి. సంధ్యారాణి వారికి కండువాలు వేసి, పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ముఖి సూర్యనారాయణ, నాయకులు గూడేపు యుగంధర్, కొరిపల్లి సురేష్, తదితరులు పాల్గొన్నారు.

డ్రైడేతో వ్యాధులు దూరం

● డీఎంవో జగన్మోహనరావు



కాలువలో చెత్తను తొలగింపజేస్తున్న డీఎంవో జగన్మోహన్‌రావు

కొమరాడ: డ్రైడే పాటిస్తే వ్యాధులు ప్రబలకుండా అదుపులో ఉంచవచ్చని జిల్లా మలేరియా అధికారి టి.జగన్మోహనరావు తెలిపారు. శుక్రవారం అర్తాం గ్రామంలో ఫ్రైడే - డ్రైడే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు పరిశీలించి దోమల లార్వా గుర్తించిన వాటిని పారబోయించారు. అలాగే ఫ్రిజ్ వెనుక భాగంలో ట్రేలలో నిల్వ ఉన్న నీటిలో లార్వా గురించి స్థానికులకు అవగాహన కల్పించారు. దోమలు మలేరియా, డెంగ్యూ, తదితర జ్వరాలకు కారణమవుతాయని అన్నారు. నీరు ఎక్కువ కాలం నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. అనంతరం గ్రామంలో నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు లభ్యతను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంవో సూర్యనారాయణ, పీహెచ్ఎన్ విజయకుమారి, వైద్య సిబ్బంది, ఆశకార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ వివరాలు ఇవ్వండి

సీతంపేట: పాలకొండ నియోజకవర్గంలో పోస్టల్ బ్యాలెట్ వివరాలను అందించాలని కోరుతూ టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పడాల భూదేవి శుక్రవారం పాలకొండ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి శుభం బన్సాల్‌కు వినతిపత్రం అందించారు. పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించిన పూర్తి వివరాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు కొత్తకోట వేణమ్మ, బి.జయలక్ష్మి, సవర గంగయ్య పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురంలో వర్షం

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని గుమ్మలక్ష్మీపురంలో శుక్రవారం ఓ మోస్తరు వర్షం పడింది. అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న ఈ సమయంలో వర్షాలు పడడంతో ప్రజలు ఊరట చెందుతున్నారు. ఈ వర్షం నీటి ఎద్దడి నివారణకు కొంతవరకు ఉపయోగపడుతుందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పశువుల మేతకు పచ్చిక మొలుస్తుందని చెబుతున్నారు.

ఒడిశా

బీజేడీతోనే సుస్థిర పాలన

రాయగడ: బీజేడీతోనే సుస్థిర పాలన సాధ్యమని రాష్ట్ర 5టీ అధ్యక్షుడు వీకే పాండ్యన్ అన్నారు. బిసంకటక్, గుణుపూర్ నియోజకవర్గాల అభ్యర్థుల తరపున ఆయన శుక్రవారం ప్రచారం నిర్వహించారు. సుస్థిర పాలన, సమగ్ర ప్రగతి కోసం బీజేడీ అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరారు. ఈ సభలో కొరాపుట్ పార్లమెంటు అభ్యర్థి కౌసల్య హికాక పాల్గొని, మాట్లాడారు. బిసంకటక్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న జగన్నాథ సారకను, గుణుపురం నుంచి పోటీ చేస్తున్న రఘునాథ్ గొమాంగ్‌లను అత్యధిక మెజారటీతో గెలిపించాలని కోరారు. ప్రచార సభలకు వచ్చిన ఆయనకు బీజేడీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా అధ్యక్షుడు పూర్వ రాజ్యసభ సభ్యులు స్వాగతం పలికారు.

ఘనంగా కృష్ణచంద్ర గజపతి జయంతి

రాయగడ: కృష్ణచంద్ర గజపతి మహారాజ్ జయంతి వేడుకను గజపతి మహారాజ్ సంస్కృతి సేవా అధ్యక్షుడు అమూల్యరతన్ సాహు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. గజపతి కూడలి వద్దనున్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంస్థ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని, గజపతి సేవలను కొనియాడారు. ఈసందర్భంగా మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు అరుణ బెహెరా నేతృత్వంలో మజ్జిగ పంపిణీ చేశారు.

క్లుప్తంగా..

టీడీపీ రాష్ట్ర మహిళా కార్యనిర్వాహక కార్యదర్శిగా పద్మ

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం మండలానికి చెందిన బిడ్డిక పద్మను టీడీపీ రాష్ట్ర మహిళా కార్య నిర్వాహక కార్యదర్శిగా నియమిస్తూ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు ప్రకటించారు. కురుపాం నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి విజయానికి కృషి చేయాలని పద్మను అధిష్ఠానం ఆదేశించింది. పద్మ నియామకంపై శుక్రవారం స్థానిక నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

హైజెనిక్ కిట్లు పంపిణీ

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని కాగితాడ గిరిజన గ్రామంలో రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో 20 పేద గిరిజన కుటుంబాలకు జిల్లా రెడ్‌క్రాస్ సంస్థ చైర్మన్ మంచుపల్లి శ్రీరాములు చేతులమీదుగా శుక్రవారం హైజెనిక్ కిట్లును అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌తో పాటు ఏజెన్సీ రెడ్‌క్రాస్ సీనియర్ సభ్యులు హరిప్రసాద్, శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు నాగేశ్వరరావు, మురళీ పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా సర్వసభ్య సమావేశం

సీతానగరం: మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపీపీ బలగ రమణమ్మ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. సమావేశం ప్రారంభించిన కొద్ది నిమిషాల్లోనే ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఎటువంటి అంశాలపై ప్రస్తావన లేకుండా ముగించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సూర్యనారాయణ, ఎంపీడీవో ఎం.ఈశ్వరరావు, పరిపాలనాధికారి ప్రసాదరావు, ఈవోఆర్డీ కుమారవర్మ, జడ్పీటీసీ, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

పరిశీలకులను నియమించిన జనసేన

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: జనసేన పార్టీ నియోజకవర్గాల పరిశీలకులను నియమిస్తూ పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ రాజకీయ కార్యదర్శి పి.హరిప్రసాద్ శుక్రవారం వారి పేర్లను విడుదల చేశారు. పాలకొండ నియోజకవర్గం నుంచి జనసేన పార్టీ అభ్యర్థి నిమ్మక జయకృష్ణ పోటీ చేస్తున్నారు. ఈ నియోజకవర్గానికి సంబంధించి పాలవలస యశస్విని, గుంగులయ్యలను పార్టీ పరిశీలకులుగా నియమించారు.

వైభవంగా నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠ

సాలూరు రూరల్: మామిడిపల్లి గిరిజా రామలింగేశ్వర ఆలయ ప్రాంగణంలో నవగ్రహ విగ్రహాలను శుక్రవారం వైభవంగా ప్రతిష్ఠించారు. ఈ పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

శివాలయ ప్రారంభోత్సవం

సీతానగరం: తామరఖండి గ్రామంలో శివాలయం ప్రారంభోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ పూజల్లో కూటమి అభ్యర్థి విజయచంద్ర పాల్గొన్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంకు శాఖ పునఃప్రారంభం

సాలూరు రూరల్: సాలూరులోని యూనియన్ బ్యాంకు శాఖను శుక్రవారం పునః ప్రారంభించారు. బ్యాంకు రీజనల్ హెడ్ ఎం.వెంకటతిలక్, బీఎం వేముల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పోలీసుల కవాతు

గరుగుబిల్లి: ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు వీలుగా పలు గ్రామాల్లో పోలీసులు కవాతు నిర్వహించారు. శుక్రవారం పెదగుడబ, చినగుడబ గ్రామాల్లో ఎస్ఐ వై.అమ్మన్నరావు ఆధ్వర్యంలో సీఆర్‌పీఎఫ్ పోలీసులతో కవాతు నిర్వహించారు. అధిక సంఖ్యలో పలు విభాగాలకు చెందిన పోలీసులు పాల్గొన్నారు.



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు



